క్లుప్తంగా

దంపతులకు సత్కారం



కొత్త శ్రీనివాస్ దంపతులను సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ సభ్యులు

రాజోలు: గోశాలకు ఆర్థిక సహకారం అందించడంతో పాటు పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న కొత్త శ్రీనివాసరావు, నాగ వెంకట పద్మావతి దంపతులను మంగళవారం ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ సభ్యులు సత్కరించారు. గోశాల నిర్వహణకు రూ.10 వేల ఆర్థిక సాయంతో పాటు శాశ్వత నిధికి శ్రీనివాసరావు దంపతులు రూ.లక్ష డిపాజిట్ అందిచారు. అలాగే మరణానంతరం అవయవ దానం చేసేందుకు దంపతులు ఇరువురు విశాఖపట్టణం అఖిల భారత అవయవ శరీర దాన సంఘానికి రాతపూర్వక అంగీరాన్ని ఇచ్చి ఆదర్శంగా నిలిచారని సంఘ సభ్యులు కొనియాడారు. ఆర్య వైశ్య సంఘ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్, మహిళా సంఘ అధ్యక్షురాలు కాసు భవాని, నాయకులు రాజా నాగరత్నకుమార్, లక్కింశెట్టి బాలాజీ, వెత్స బద్రి, చలువాది త్రినాథ్, కాసు శ్రీనివాస రంగనాయక మూర్తి, గెల్లి అన్నపూర్ణ, వెత్స భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వో మృతి



కప్పల రాజేశ్వరి (ఫైల్)

ఆలమూరు: మండలంలోని మూలస్థాన అగ్రహారం-2 గ్రామ సచివాలయం రెవెన్యూ అధికారి(వీఆర్వో) కప్పల రాజేశ్వరి (48) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఇటీవల రాజేశ్వరి మధుమేహ సంబంధిత వ్యాధితో తీవ్ర అస్వస్థతకు గురికాగా నాలుగు రోజుల క్రితం ఆమెను కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరం ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్సను అందించారు. ఆరోగ్యం మరింతగా క్షీణించి పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ రాజేశ్వరి మృతి చెందారు. ఆమె స్వస్థలమైన బడుగువానిలంకలో తొలుత గ్రామ సహాయ అధికారిగా పనిచేసి పదోన్నతిపై మూలస్థాన అగ్రహారం బదిలీపై వచ్చారు. వీఆర్ఓ రాజేశ్వరి మృతికి తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్లు ఎం.జానకి రాఘవ, కె.విజయరత్న, సర్పంచ్ లంక వరప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శి పాలింగి రాజు, గ్రామ రెవెన్యూ అధికారుల సమాఖ్య తదితరులు పంతాపం తెలిపారు.

వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడి మృతి



నాగళ్ల నరసింహ స్వామి (ఫైల్)

మలికిపురం: మండలంలోని గొల్లపాలెం మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నాగళ్ల నరసింహ స్వామి 65) మంగళవారం ఆకస్మిక మృతి చెందారు. గ్రామంలో పార్టీకి ఎంతో అండగా నిలిచిన నరసింహ స్వామి మృతిపై గ్రామస్తులు దిగ్భ్రాంతి చెందారు. ఆయన మృతికిమాజీ ఎమ్మెల్యేలు, రాపాక వరప్రసాదరావు, గొల్లపల్లి సూర్యారావు, గ్రామ నాయకులు నరసింహస్వామి మృతదేహానికి నివాళులర్పించి కుటుం సభ్యులకు సంతాపం తెలిపారు.

బెల్లంపూడిలో మెడికల్ క్యాంపు

పి.గన్నవరం: మండలంలోని బెల్లంపూడి అంబేడ్కర్ కాలనీలో గత కొన్ని రోజులుగా విష జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో మంగళవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. వైద్యాధికారి రియాజ్ తున్నీషా బేగం ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. ఎవరైనా జ్వరాలతో బాధ పడుతున్నారా అని ఆరా తీశారు. మంగళవారం నిర్వహించిన ఇంటింటి సర్వేలో జ్వరాల కేసులు నమోదు కాలేదని ఆమె తెలిపారు. అంబేడ్కర్ కాలనీలో పారిశుధ్య చర్యలు చేపట్టారు. బుధవారం ఎబేటు మందును పిరికారీ చేయిస్తామని వైద్య సిబ్బంది తెలిపారు. సబ్ యూనిట్ ఆఫీసర్ రాజశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

అయినవిల్లి: నల్లచెరువులో కొలువైన పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శ్రవణ నక్షత్రం సందర్భంగా వేదపండితుల ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు జరిపారు. తెల్లవారుజాము నుంచి స్వామికి విశేష పంచామృతాభిషేకం వంటి విశేష పూజలు జరిపారు. స్వామికి శాంతి కల్యాణం జరిపారు. స్వామివారి పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం జరిపారు.

ఉత్సాహంగా నేను బడికి పోతా

- అవిడి, మామిడికుదురు, సఖినేటిపల్లిల్లో ర్యాలీలు
- పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



అవిడి గ్రామంలో 'నేను బడికి పోతా' ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈఓ హరిప్రసాద్ తదితరులు



మామిడికుదురు సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వేణుగోపాలరెడ్డి

కొత్తపేట: బడి ఈడు చిన్నారులను పనులకు పంపకుండా బడికే పంపాలని జిల్లా సమగ్ర శిక్ష ఏఎల్ఎస్ఓ డి.రమేష్‌బాబు, ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వ నూతనంగా ప్రవేశపెట్టిన 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని అవిడి గ్రామంలో నిర్వహించారు. ఎంఈఓలు ఎం.హరిప్రసాద్, కె.లీలావతి పర్యవేక్షణలో అవిడి చప్పిడివారిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం కె.అరుణశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా సమగ్ర శిక్ష ఏఎల్ఎస్ఓ రమేష్‌బాబు పాల్గొన్నారు. ఏఎల్ఎస్ఓ రమేష్‌బాబు, ఎంఈఓ హరిప్రసాద్ మాట్లాడుతూ ఆరేళ్ల వయసు నుంచి బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలన్నారు. చిన్నారుల చదువును హరించే హక్కు ఎవరికీ లేదన్నారు. మధ్యలో బడి మానేస్తున్న చిన్నారులను తిరిగి పాఠశాలలో చేర్పించేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమం ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. 'అమ్మకు వందనం', 'స్టూడెంట్ కిట్', 'పీఎం పోషణ్', 'మధ్యాహ్న భోజన పథకం' వంటి చిన్నారుల విద్యా ప్రోత్సాహక కార్యక్రమాలను తల్లిదండ్రులకు వివరించి, వారి పిల్లలను పాఠశాలల్లో చేర్పించి, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమం జూలై 12 వరకూ కొనసాగుతుందన్నారు. ఆ లోపు బడి ఈడు పిల్లలను గుర్తించి వారందరూ బడిలోనే ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. 'నేను బడికి పోతా', 'పిల్లలు ఉండాల్సింది పనిలో కాదు.. బడిలో' అనే నినాదంతో కూడిన ఫ్లెక్సీతో అధికారులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

బడి బయటి పిల్లలను గుర్తించండి

మామిడికుదురు: బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించే బడికి పోదాం కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎంపీడీఓ ఎస్.వేణుగోపాలరెడ్డి సూచించారు. మామిడికుదురు ఎమ్మార్సీలో మంగళవారం జరిగిన అవగాహన సమావేశంలో బడికి పోతా, పారిశుద్ధ్యం కార్యక్రమాలపై పలు శాఖల ఉద్యోగులతో సమీక్షించారు. బడికి పోదాం కార్యక్రమం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ చాలెంజ్‌గా తీసుకోవాలని ఎంఈఓలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు పేర్కొన్నారు. బడి బయట ఉన్న చిన్నారులను గుర్తించడం జరుగుతుందని, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని ఐసీడీఎస్ సీడీపీఓ విజయశ్రీ చెప్పారు. డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ఉన్న తాగునీటి కుళాయిలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, వాటిని శుభ్రం చేయించాలని ఏఓ వెంకటేశ్వరరావు సూచించారు. తాగునీటి లీకేజీలను అరికట్టాలని, ఇంటింట ఫీవర్ సర్వేలో అనుమానితులను గుర్తించి వారికి పరీక్షలు చేయించాలన్నారు. డీటీ శరణ్య, పంచాయతీ కార్యదర్శులు, ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు, ఇంజినీరింగ్ ఇసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

సఖినేటిపల్లి: విద్యతోనే సమాజాభివృద్ధి చెందుతుందని సమగ్ర శిక్షా జిల్లా అధికారి (సీఎంవో) బి.సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం కొత్తగా శ్రీకారం చుట్టిన నేడు బడికి పోతా కార్యక్రమంపై మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఒక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ప్రతి పాఠశాల ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ పిల్లలతో పాటు తల్లిదండ్రులకు చదువు ఆవశ్యకత గురించి అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం నేను బడికి పోతా బ్యానర్‌తో విద్యాశాఖ, మండల స్థాయి అధికారులు ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. బడి ఈడు పిల్లలు అందరూ బడిలోనే ఉండాలని, బడి మానేసిన పిల్లలను గుర్తించి మళ్లీ బడిలో చేర్పిద్దాం అంటూ ఈ ర్యాలీ చేశారు. ఎంపీడీవో పీవీ సత్యనారాయణ, ఎంఈవో-1 డి.కిషోర్ కుమార్, ఎంఈవో-2 మద్దాలి వెంకటేశ్వరరావు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మలికిపురంలో..

మలికిపురం: బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలని మండలంలోని పడమటిపాలెం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాగర శ్రీనివాస్ కోరారు. పాఠశాల ఆధ్వర్యంలో గ్రామంలో మంగళవారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో అందరూ చదవాలి. అందరూ ఎదగాలని సూచించారు. చదువు విలువ ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు. ఉపాధ్యాయులు శిరిగినీడి భైవరమూర్తి, ఏవీ శ్రీనివాస్, నాగదేవి, మురళి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విస్తరణాధికారి అవార్డుకు కొండయ్య ఎంపిక



అవార్డుకు ఎంపికైన కొండయ్య

అంబాజీపేట: స్థానిక ఉద్యాన పరిశోధన కేంద్రంలో వ్యవసాయ విస్తరణాధికారిగా విధులు నిర్వహిస్తున్న పీఎం కొండయ్య ఉత్తమ విస్తరణ అధికారి అవార్డుకు ఎంపికైనట్లు కేంద్ర అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు మంగళవారం తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం 17వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఉద్యాన విశ్వవిద్యాలయ ఉప కులపతి డాక్టర్ టి.జానకిరామ్ చేతుల మీదుగా ప్రదానం చేయనున్నారన్నారు. కొండయ్య తన విధులను సక్రమంగా నిర్వర్తించి హైబ్రీడ్ వంగడాలను వృద్ధి చేయడంలోను, కొబ్బరిలో నాణ్యమైన మొక్కల తయారీకి నిరంతరం కృషి చేసినందుకు గాను ఈ పురస్కారం లభించిందన్నారు. ఈ సందర్భంగా చలపతిరావుతో పాటు తెగుళ్ల విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వి.గోవర్ధనరావు, తెగుళ్ల విభాగం శాస్త్రవేత్త బి.నీరజ, కీటక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ వి.అనూష, ఉద్యాన విభాగ శాస్త్రవేత్త ఎ.కిరీటి, కార్యాలయ సిబ్బంది, బోధనేతర సిబ్బంది అవార్డుకు ఎంపికైన కొండయ్యను అభినందించారు.

3న శాంతి కల్యాణం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో వచ్చే నెల 3వ తేదీన బహుళ ద్వాదశి పర్వదినాన స్వామివారి శాంతి కల్యాణం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ మంగళవారం తెలిపారు. సదరు కల్యాణం టికెట్లు ముందస్తు బుకింగ్‌ను ఏపీ టెంపుల్ వెబ్‌సైటులో లేదా నేరుగా ఆలయం వద్ద కౌంటర్ నందు తీసుకోవచ్చని ఆయన అన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి



ఆలమూరులో డయేరియాపై వీడియో కాన్ఫరెన్స్ తిలకిస్తున్న మండల స్థాయి అధికారులు



తొత్తరమూడి గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సచివాలయ సిబ్బంది

అంబాజీపేట: డయేరియాపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ జీవీ సరోవర్ అన్నారు. అతిసార వ్యాధితో ఏ ఒక్కరూ బాధపడకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వైద్యాధికారులతో డయేరియాపై సమీక్ష సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఎంపీడీఓ సరోవర్ మాట్లాడుతూ డయేరియా ప్రభావం, ముందస్తు జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యలపై క్యాంపెయిన్ చేపట్టాలని ఆదేశించారు. నీటి పరిశుభ్రత, కాలుష్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి డయేరియాను అరికట్టేందుకు అందరి సహకారంతో కృషి చేద్దామన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు క్లోరినేషన్ చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ బి.మమత, వైద్యాధికారులు కె.ఎస్.శ్రీనివాస్, ఎ.ఇంద్రావతి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డయేరియాను పూర్తిగా నియంత్రించాలి

ఆలమూరు: వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పలు గ్రామీణ ప్రాంతాల్లో వ్యాప్తి చెందుతున్న డయేరియాను పూర్తిగా నిర్మూలించాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వైద్యారోగ్యశాఖాధికారులకు మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. సీజనల్ వ్యాధుల నిర్మూలనకు క్షేత్రస్థాయిలో తీసుకోవలసిన చర్యలను ఆయన వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో అనునిత్యం పర్యటించి సంపూర్ణ పారిశుధ్య చర్యలను పాటించాలని కోరారు. మండలంలోని ఆయా పీహెచ్‌సీల్లో సీజనల్ వ్యాధులపై సమీక్ష నిర్వహించి దానికనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ ఎ.మేరీ రోజ్, ఏడీఏ కె.నాగేశ్వరరావు, వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: డయేరియా వ్యాధి ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తొత్తరమూడి గ్రామస్తులకు పంచాయతీ కార్యదర్శి గరిమెళ్ల రవి వివరించారు. సచివాలయ సిబ్బందితో గ్రామంలో డయేరియాపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తడి చెత్త లేకుండా చూడాలని పూల కుండీల్లో నీరు నిలువ ఉండకుండా చూడాలని, మురుగు నీరు ఎప్పటికప్పుడు మళ్లించాలని ఇలా పలు అంశాలను వివరించారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి



కె.పెదపూడిలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ ప్రకాష్

అంబాజీపేట: పాఠశాలకు వచ్చే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని ఎంఈఓ-2 మోకా ప్రకాష్ అన్నారు. కె.పెదపూడి శివారు నందెపువారిపాలెం ప్రాథమిక పాఠశాలను మంగళవారం పరిశీలించారు. ఎంఈఓ విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ ప్రతి విద్యానకథి నిత్యం పాఠశాలకు వచ్చేలా చూడాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, యూనిఫారమ్, టై, బెల్ట్, షూలు, సాక్సులు అందించడమే కాకుండా నాణ్యమైన భోజనం పెడుతున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా విద్యార్థులను చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు వండిన భోజనాన్ని, కూరలను పరిశీలించారు.

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలి



వానపల్లిలో రక్షిత మంచినీటి పథకం పరిశీలిస్తున్న డీపీఓ రాంబాబు

కొత్తపేట: ప్రజలకు స్వచ్ఛమైన సురక్షిత తాగునీరు అందించాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) పంచాయతీ అధికారులకు సూచించారు. వర్షాకాలం ప్రారంభమై వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తాగునీరు కలుషితం కాకుండా అధికారులు చర్యలు చేపట్టారు. దానిలో భాగంగా గ్రామాల్లోని రక్షిత మంచినీటి పథకాల ట్యాంకులను క్లీనింగ్, ట్యాంకుల పరిసరాలు పరిశుభ్రం చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ స్పెషల్ డ్రైవ్ పరిశీలనలో భాగంగా డీపీఓ రాంబాబు మంగళవారం స్థానిక అధికారులతో కలసి మండలంలోని వానపల్లి, వాడపాలెం, కొత్తపేట, పలివెల గ్రామాల్లోని రక్షిత మంచినీటి పథకాలను, తాగునీరు సరఫరా తీరుతెన్నులను పరిశీలించారు. ట్యాంకుల నుంచి ప్రజలకు తాగునీరు సరఫరా చేసే పైపులు ఎలా ఉన్నాయి? ఎక్కడైనా లీకులతో తాగునీరు కలుషితం అవుతోందా? ట్యాంకులు క్లీనింగ్‌కు సంబంధించి రికార్డు, బోర్డుపై డేట్ టు డేట్ మెయింటైన్ చేస్తున్నారా? క్లోరినేషన్ చేస్తున్నారా? వంటి అంశాలను ఆరా తీశారు. కార్యక్రమంలో వానపల్లి సర్పంచ్ పల్లి భీమారావు, ఈఓపీఆర్‌డీ సుబ్బారావు, పంచాయతీ సెక్రటరీలు వీవీ రామన్, సత్తిబాబు, రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సొమ్ములు ఇప్పించాలని వినతి

రాజోలు: దాళ్వా సాగుకు సంబంధించిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వానికి విక్రయించామని రెండు నెలలు కావస్తున్నా ధాన్యం సొమ్ములు రాలేదని పలువురు రైతులు వాపోయారు. ఈ మేరకు మంగళవారం కడలి, చింతలపల్లి గ్రామాలకు చెందిన రైతులు తహసీల్దార్ గోపాలకృష్ణకు వినతిపత్రాన్ని అందజేశారు. అప్పులు చేసి దాళ్వా సాగు చేపట్టామని, ధాన్యం విక్రయించి రెండు నెలలు అయినా డబ్బులు రాలేదని వాపోయారు. అంతేకాకుండా సార్వా సాగు చేపట్టేందుకు పెట్టుబడికి ఇబ్బందులు పడుతున్నామన్నారు. త్వరితగతిన దాళ్వా ధాన్యం సొమ్ములు ఇప్పించాలని కోరారు. రైతులు మన్నే సత్యప్రసాద్, గెద్దం సత్యనారాయణ, వై.నాగరాజు, ఎస్.వెంకట ప్రసాద్, కుడిపూడి నాగరాజు, పాటి నారాయణరావు, చెల్లుబోయిన సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జంతువులకూ హక్కులుంటాయని గ్రహించండి

ఆలమూరు: జంతువులకు సైతం హక్కులుంటాయనే అంశాన్ని విద్యార్థులందరూ గ్రహించాలని ఆలమూరు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.అనిత వ్యాఖ్యానించారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో స్థానిక బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాల, పెనికేరు, గుమ్మిలేరు పాఠశాలల్లో జంతువుల హక్కులపై మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. జంతువులని హింసిస్తే చట్ట ప్రకారం తీసుకునే చర్యలు, పెంపుడు జంతువుల పట్ల వ్యవహరించాల్సిన తీరు, సకాలంలో వ్యాక్సినేషన్ తదితర అంశాలను ఏడీ అనిత వివరించారు. పశుసంవర్ధక శాఖ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

మలికిపురం: ఉపాధి హామీ కూలీలకు రోజు కూలి 600 రూపాయలకు పెంచాలని, పనిదినాలను 200 రోజులకు పెంచాలని, వేతనాలు సక్రమంగా చెల్లించాలని, ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలను విడనాడాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు దేవ రాజేంద్ర ప్రసాద్ న్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గెద్దం ప్రభాకరరావు, కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లి బుజ్జి బాబు, సీపీఐ మలికిపురం మండల కార్యదర్శి దేవ సురేష్ బాబు, బత్తుల రవిప్రసాద్ పెద్ద సంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

రేపటి నుంచి కొబ్బరి మొక్కల పంపిణీ

అంబాజీపేట: స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రంలో కొబ్బరి మొక్కలను ఈ నెల 27 నుంచి పంపిణీ చేయనున్నట్లు పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు తెలిపారు. 2024 సంవత్సరానికి సంబంధించి కొబ్బరి మొక్కలకు రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మాత్రమే పంపిణీ చేస్తామన్నారు. మొక్కల పంపిణీ క్రమ పద్ధతిలో పంపిణీ చేస్తామని రైతులు గుర్తించాలన్నారు

ఘనంగా వార్షిక కల్యాణ మహోత్సవాలు

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెంలో వేంచేసిన భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిపారు. వేదపండితులు గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య, మండపారాధన, త్రిశూల పూజ, ప్రత్యేక హోమం నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిపారు వేదపండితులు భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పలువురికి ఆర్థిక సాయం



మలికిపురంలో లబ్ధిదారులకు సాయం అందిస్తున్న జంపన బుజ్జిరాజు

మలికిపురం: మండలంలోని నలుగురికి వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు సమకూర్చిన ఆర్థిక సాయాన్ని చెక్‌ల రూపేణా మంగళవారం వసుధ ఫౌండేషన్ ప్రతినిధి జంపన బుజ్జిరాజు అందించారు. వివిధ సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఆచంట గవరయ్య, వలవల శ్రీనివాసరావు, ఉలిశెట్టి వీర వెంకట సత్యనారాయణ, బోనం కనకదుర్గలకు తలా పదివేలు చొప్పున మొత్తం రూ.40 వేలను సాయంగా అందించారు. మలికిపురంలో జరిగిన కార్యక్రమంలో ఆయా గ్రామాల్లోని పెద్దలు పాల్గొని వెంకట రామరాజు చేస్తున్న సేవలను కొనియాడారు. లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.


ఘనంగా అమ్మవారి తీర్థాలు



అవిడి గ్రామంలో కట్వలాంబిక అమ్మవారి గరగలను ఊరేగిస్తున్న భక్తులు



తొండవరంలో వేంచేసిన రాజ్యలక్ష్మి అమ్మవారు



మరిడమ్మవారు

అయినవిల్లి: తొత్తరమూడి గ్రామ దేవతగా పూజలందుకుంటున్న మురుగులమ్మవారికి మంగళవారం తీర్థ మహోత్సవాలు జరిపారు. సోమవారం జాతర మహోత్సవాలు జరిపారు. భారీ ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని కానుకలు, మొక్కులు చెల్లించారు. అలాగే మాగంలో కొలువుదీరిన మరిడమ్మ, మహాలక్ష్మమ్మ వార్లకు జాతర, తీర్థ మహోత్సవాలు జరిపారు. భారీ ఎత్తున తీర్థ మహోత్సవాలు జరిపారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా రాజ్యలక్ష్మి అమ్మవారి తీర్థం

అంబాజీపేట: తొండవరంలో వేంచేసిన రాజ్యలక్ష్మి అమ్మవారి తీర్థాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఆడపడుచులు, భక్తులు అమ్మవారికి ముడుపులు, మొక్కులు, చలివిడి పానకాలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి జాతరను సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ నెల 29 అమ్మవారి జలకం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా కట్వలాంబిక అమ్మవారి తీర్థం

కొత్తపేట: మండలంలోని అవిడి గ్రామ దేవత కట్వలాంబిక అమ్మవారి తీర్థ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. దేవదాయ-ధర్మదాయ శాఖ పరిధిలోని కట్వలాంబిక అమ్మవారి తీర్థ మహోత్సవాలు ఏటా జ్యేష్ఠ మాసం పౌర్ణమి తరువాత వచ్చే మంగళవారం నిర్వహించడం ఆనవాయితీ. ఆ మేరకు ఆదివారం రాత్రి చిన్న జాతర, సోమవారం రాత్రి పెద్ద జాతర జరపగా మంగళవారం తీర్థం నిర్వహించారు. అమ్మవారి గ్రామోత్సవం జరిపారు. వీధి వీధినా అమ్మవారికి (ఆసాదులు తీసుకువచ్చిన గరగలకు) భక్తులు స్వాగతం పలికి తోడ్కొని వెళ్లారు. పసుపు, కుంకుమలు, పానకాలు సమర్పించారు. తీర్థం సందర్భంగా దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఆలయ ఆసాదులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపి, మహా కుంభాభిషేకం సమర్పించి భక్తులను దర్శనానికి అనుమతించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు, నైవేద్యాలు సమర్పించారు. దీంతో అవిడి గ్రామం భక్తులతో కిటకిటలాడింది.